క్లుప్తంగా

కార్యకర్తకు పరామర్శ



బాధితుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆడారి హరీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ శనివారం హరీష్ నివాసానికి వెళ్లి అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ఎన్నికల అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖ విద్య: ఐఎన్‌సీఈ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుత పాలక వర్గానికి వత్తాసు పలుకుతున్న ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఐఎన్‌సీఈ, బీఎంఎస్ యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న జరగనున్న సహకార ఎన్నికల్లో ప్రస్తుత పాలక వర్గమైన సీఐటీయూ అనుబంధ యూనియన్‌కు మేలు చేసేలా ఎన్నికల అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారిని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిష్పక్షపాతంగా నిర్వహించేలా కలెక్టర్, సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్ జోక్యం చేసుకోవాలని ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఎస్.రాజేష్ కోరారు.

కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం: మహాశివరాత్రి సందర్భంగా బిల్వపత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.వి.ఎస్.రవి మాట్లాడుతూ వారాంతంలోనూ, ఆయా పర్వదినాల్లో పేదలు, వృద్ధులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కె.కృష్ణమూర్తి, ట్రస్ట్ సభ్యులు వెంకటరావు, సుబ్బారెడ్డి, కుమారస్వామి, రాజు, రవి, శంకర్‌రాము, నరసింగరావు, సీతారామయ్య, పార్వతి, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆయారాం.. గయారాంలకు బీజేపీలో చోటు లేదు

గోపాలపట్నం: భారతీయ జనతా పార్టీలో ఆయారాం గయారాంలకు చోటు ఉండదని రాష్ట్ర సభ్యత ప్రముఖ్ గొన్నబత్తుల చంద్రశేఖర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణలాంటి వారు వస్తుంటారు పోతుంటారని దుయ్యబట్టారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారు పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజు చిన్ననాటి నుంచి పార్టీలో ఉంటూ నిస్వార్థ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఏదో ఒక పార్టీ ద్వారా మంత్రి పదవి ఆశించే కన్నా బయటికి వెళ్లిపోయారని విమర్శించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల వెంకట అప్పారావు(శ్రీనివాస్) కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు.

నమో శివరుద్రాయ



బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

- భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

మల్కాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరనామస్మరణ మార్మోగింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శైవక్షేత్రాల్లో రుద్రాభిషేకాలు.. క్షీరాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ పాల్గొని అక్కడ నెలకొల్పిన శివలింగానికి అభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ బ్రహ్మకుమారీలు శివపురాణం,ధ్యానం వల్లన ప్రయోజాలను వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు,వూండి మల్లేశ్వరరావు,దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

- ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువు దీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పారిశ్రామిక ప్రాంత నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహారుద్రాభిషేకం చేశారు.
- ప్రకాష్‌నగర్ శివరామకృష్ణ ఆలయంలో, శ్రీహరిపురంలోని హరి హర క్షేత్రంతో పాటు 58వ వార్డు గంగానగర్ కొండపై కొలువుదీరిన పసుపతినాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



రుద్రాభిషేకం కోసం సిద్ధం చేసిన ఉత్సవమూర్తులు

అభిషేకాలు... అర్చనలు

కంచరపాలెం: గవర కంచరపాలెం గణపతి గౌరీ వరమేశ్వర శ్రీవల్లి దేవసేన కుమారస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు అల్లూరి శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రామ్మూర్తిపంతులుపేట, సాంబమూర్తినగర్,తుమ్మడపాలెం, ఐటీఐ కూడలి,104 ఏరియా బాపూజీనగర్ లోని అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, లక్ష్మీగణపతి ఈశ్వరాలయం, కోదండ ఉమా మహేశ్వరాలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామాభ్యుదయ సంఘం చైర్మన్ భీమరశెట్టి సురేష్, కార్యదర్శి పిల్లా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 6 గంటల పాటు రుద్రహోమం నిర్వహించారు.



అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

మార్మోగిన హరనామ స్మరణ

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో శివాలయాల్లో హరనామస్మరణ హోరెత్తింది. ఎన్ఏడీ శివాలయం, కాకానినగర్, కరాసా, సీతారామరాజునగర్, గోపాలపట్నం, కొత్తపాలెం, వెంకటాపురంలోని శివాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివ రాత్రి, శనివారం రోజున త్రయోదశి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు పోటెత్తారు. ఎన్ఏడీ ప్రథమ ఉమా లిగేశ్వరాలయంలో భక్తులు బారులు తీరారు. సాయంత్రం సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. కాకానినగర్ శివాలయంలో అర్చకుడు నత్తెప్ప పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మహిమాన్వితం...శివలీలామృతం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని శ్రీ సోమశేఖర పంచాయతన శివాలయంలో అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు పూజల్లో పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో శివాలయంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, పారిశ్రామికవేత్తలు మజ్జి సోమేష్, మజ్జి మాలినాయుడు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శ్రీశివరామకృష్ణ ఆలయానికి భక్తులు పోటెత్తారు.



కాకానినగర్ శివాలయంలో నవగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు



కంచరపాలెం శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

ఘనంగా పరస

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చే శ్రీ శివసాయి దుర్గా వెంకట అభయాంజనేయ కొండదేవతమ్మ పరస మహోత్సవాన్ని నాలుగు గ్రామాల ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పరస మహోత్సవానికి పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు.



ఎన్ఏడీ శివాలయంలో దర్శనాలకు వేచి ఉన్న భక్తులు



కాకానినగర్ శివాలయంలో విశేషాలంకరణలో శివుడు



సీతారామరాజునగర్‌లో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



ఎన్ఏడీ జంక్షన్ శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

విజేతలకు బహుమతుల ప్రదానం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రాం క్రీడా మైదానంలో మహాశివరాత్రి సందర్భంగా జీఆర్‌కే యూత్ అధ్వర్యంలో నిర్వహించిన విండ్ బాల్ క్రికెట్ టోర్నీ విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్స్‌గా ఎస్ఆర్‌కే టీమ్, రన్నర్‌గా 7రోకర్స్ జట్టు నిలిచింది. కార్యక్రమంలో శరగడం సతీష్,హరీష్, రాజబాబు, తేజ, సాయి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు



క్రికెట్ టోర్నీ విజేతలను అభినందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

- గిరిజన వసతిగృహాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- వార్డెన్ బదిలీకి సిఫారసు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్ రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రవిబాబు

ఏపీ విద్యా విధానం దేశానికే ఆదర్శం



డైట్ కాలేజీలో ఢిల్లీ విద్యాధికారుల బృందం

భీమునిపట్నం: మన రాష్ట్రంలోని విద్యా విధానం దేశానికే ఎంతో ఆదర్శంగా ఉందని ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి అన్నారు. ఢిల్లీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యాధికారుల బృందం శనివారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్), కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బృందాలు వీటిని సందర్శించడం వల్ల పరస్పరం విద్యా విధానం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తోందని, అందులో భాగంగా వారికి నాణ్యమైన విద్యతోపాటు, అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఢిల్లీ విద్యాధికారులు శ్రీరామ్‌కిశోర్, రుసు చౌదరి, సునీత మిట్టల్, ఇరత సభ్యులకు బోధన విధానాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద

ఏయూక్యాంపస్ : ప్రపంచ దిశ.. దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, వెంకటరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న యువతతో నిర్వాహకులు

రోడ్డు పనులు పరిశీలించిన జియ్యాని



మర్రిపాలెం రైతు బజారు వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతు బజారు వద్ద బీటీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం పరిశీలించారు. నాణ్యతా లోపాలకు తావు లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ 52వ వార్డులో పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. వార్డును మోడల్ వార్డుగా తీర్చి దిద్దుతామని తెలిపారు. త్వరలో మరి కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ ఏడు కొండలు, ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: మహాశివరాత్రితో పాటు శనిత్రయోదశి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో నవగ్రహాలకు అర్చకులు పాలు, తైలం,నువ్వులతో అభిషేకాలు చేశారు. ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో నవగ్రహాలకు భక్తులు అభిషేకాలు చేసి,వాటి చుట్టూ ప్రదక్షిణ చేశారు.అలాగే న్యూకాలనీ వద్ద గల నవగ్రహాలకు ఆలయ అర్చకులు పూజలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు



సీఎండీ నుంచి అవార్డులందుకుంటున్న విశ్వనాథరాజు, రఘు నాయక్, వెంకటరమణ, ఎల్లేటి శ్రీనివాసరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగీ్తో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అలనాటి మేటి చిత్రం ‘శంకరాభరణం’



మాట్లాడుతున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట: సాహిత్య సురభి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ‘శంకరా విశ్వనాథా పర’ అనే అంశంపై సాహితీవేత్త రాంభట్ల నృసింహశర్మ ప్రసంగించారు. ఈ సభకు వృద్ధుల కల్యాణ రామరావు అధ్యక్షత వహించగా, అతిథులుగా సినీ నటులు ఎస్.కె.మిశ్రో, డాక్టర్ ద్వారం వెంకటకృష్ణ గణేశ త్యాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా రాంభట్ల మాట్లాడుతూ శంకరాభరణం సినిమా రాక ముందు కథా అంశం, సంగీత ప్రాధాన్యం విషయాలను వివరించారు. పాశ్చాత్య సంగీత పెను తుపానుకు రెపరెపలాడుతున్న సత్సాంప్రదాయ సంగీత జ్యోతిని ఒక్క కాపు కాయడానికి శంకరాభరణం చిత్రం నిర్మించిన మహానుభావులకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. శంకరాభరణం శంకరశాస్త్రిగా పేరు గాంచిన జె.వి.సోమయాజులు ఒక గొప్ప సంగీత విద్వాంసుడని, ఆయన సంగీతమంటే చెవి కోసుకునే వాళ్లు చాలా మంది ఉంటారన్నారు. కళలను ఆరాధించే తులసి(మంజు భార్గవి) గురుభావంతో శంకర శాస్త్రిని ఆరాధిస్తుందన్నారు. ఓంకార నాదాను, దొరకునా ఇటువంటి సేవ, బ్రోచేవారెవరురా, శంకరా నాదశరీరా పర, ఏ తీరుగ నను, పలుకే బంగారమై ఇలాంటి ఆణిముత్యాల్లాంటి పాటలు, సంగీత ప్రాధాన్యం గురించి వివరించారు. ఈ చిత్రం తర్వాత దర్శకుడు కె.విశ్వనాథ్ కళాతపస్విగా పేరుపొందారని, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు తెలుగు చలన చిత్రసీమలో సుస్థిర స్థానం లభించిందని పేర్కొన్నారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పీఎం పాలెం: మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఒకరికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది అమరావతి కాలనీకి చెందిన ఉప్పాడ లక్ష్మిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన సయ్యద్ రఫీ అక్టోబర్ 5, 2020న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవికుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఎస్ఐ సీహెచ్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. విచారణ జరిపిన అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారని సీఐ రామకృష్ణ తెలిపారు.